క్లుప్తంగా

సత్కారం, అభినందన



కొండా విజయ్‌ను అభినందిస్తున్న పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ఒలింపిక్‌ సంఘం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన కొండా విజయ్‌ని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సీఎం కప్‌లో భాగంగా గచ్చిబౌలిలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్‌ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పీఏసీ చైర్మన్‌ గాంధీని ఆహ్వానించారు.

క్లాత్‌ బ్యాగులు వినియోగించాలి



క్లాత్‌ బ్యాగులు అందజేస్తున్న లయన్‌ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్‌: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ సంచుల కాకుండా క్లాత్‌తో తయారు చేసిన సంచులను వినియోగించాలని లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు లయన్‌ అన్నెం కోటి రెడ్డి కోరారు. శ్రీ వివేకానందనగర్‌, ఎర్రగడ్డ, మూసాపేటతో పాటు వివిధ ప్రాంతాల్లోని రైతుబజార్లు, వారంతపు సంతల్లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసేవారికి క్లాత్‌ సంచులను సోమవారం అందజేశారు. అలాగే ప్లాస్టిక్‌ వాడకంతో జరిగే నష్టాలు, క్లాత్‌ సంచులతో కలిగే లాభాలను కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు.

మానసిక ఒత్తిడికి గురి కావొద్దు



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో హార్ట్‌ ఫుల్‌నెస్‌ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్‌ ప్రణాళికలు ఎలా వేసుకోవాలనే అంశాలను వివరిస్తూ, మెడిటేషన్‌ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఎలా పొందాలనే అంశాలపై సంస్థ ప్రతినిధి నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితుడిని పరామర్శిస్తున్న లయన్‌ కెల్లా వెంకట్రావు

మోతీనగర్‌: ఆంధ్రప్రదేశ్‌ లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బీ రోహిత్‌ నగరంలోని కేన్సర్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నది. తన మిత్రుల ద్వారా విషయం తెలుసుకున్న లయన్స్‌ క్లబ్‌ బంజారాహిల్స్‌ శాఖ మాజీ అధ్యక్షుడు లయన్‌ కెల్లా వెంకట్రావు ఆసుపత్రికి వెళ్లి రోహిత్‌ను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అతని తల్లికి రూ. 30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్‌ తల్లి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఎన్‌టీయూహెచ్‌లో

‘క్లీన్‌ క్యాంపస్‌ డ్రైవ్‌’ షురూ

ప్రారంభించిన వీసీ బాలకిష్టారెడ్డి

- పాల్గొన్న అధికారులు, వలంటీర్లు, విద్యార్థులు
- నెలలో రెండురోజులు చేపట్టాలని సూచన



క్యాంపస్‌ను శుభ్రం చేస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ వీ బాలకిష్టారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ‘క్లీన్‌ క్యాంపస్‌ డ్రైవ్‌’ ను ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్‌ వీ బాలకిష్టారెడ్డి సోమవారం ప్రారంభించారు. యూనివర్సిటీ రెక్టర్‌ డా. కే విజయకుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ డా. కే వెంకటేశ్వరరావు, చీఫ్‌ ఇంజినీర్‌ డా. వెంకటేశ్వరరెడ్డి, కాలేజి ప్రిన్సిపాల్‌ డా. జీవీ నరసింహారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి వారితో కలిసి చీపురుతో రోడ్లను శుభ్రం చేయడంతో పాటు, పార చేతపట్టి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. క్యాంపస్‌ శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రతి నెలలో 2 రోజుల పాటు నిర్వహించాలని ఇన్‌చార్జి వీసీ వారికి సూచించారు. క్యాంపస్‌ను శుభ్రంగా ఉంచడం, పర్యావరణ అనుకూలంగా రూపొందించడం, విద్యార్థులు, సిబ్బందికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, పచ్చదనం గురించి అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ డా. ఎస్‌. శోభారాణి, యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్‌ డా.ఎం. పద్మావతి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.



దోభీఘాట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



దోభీఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్‌- 1లోని దోబీ ఘాట్‌ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబురావు, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధోబీ ఘాట్‌ను అత్యాధునిక హంగులతో మోడ్రన్‌ దోబీ ఘాట్‌గా తీర్చిదిద్దాలన్నారు. అలాగే నాయీ బ్రాహ్మణ సంఘ భవనం పనులు, నాలా ప్రహరీ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ శంకర్‌, ఏఈ శ్రీనివాస్‌, రజక సంఘం సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు ఏసీపీ కౌన్సెలింగ్‌



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌ ఇస్తున్న బాలానగర్‌ ఏసీపీ హనుమంతరావు

బాలానగర్‌: బాలానగర్‌ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ హనుమంతరావు రౌడీ షీటర్లకు సోమవారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలుకు తరలిస్తామన్నారు. క్షణికావేశంలో తప్పులు చేస్తే వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై షీట్‌ ఎత్తివేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఐ సుభాష్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి కృషి



జేసీబీతో పార్కు స్థలాన్ని చదును చేయిస్తున్న కార్పొరేటర్‌

ఆల్విన్‌కాలనీ: పార్కు నిర్మాణానికి కృషి చేస్తానని ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. కూకట్‌పల్లి, ఆల్విన్‌ కాలనీ ఫేజ్‌-2 శివాలయం వెనుక వీధిలో ఆలివ్‌న్‌ హౌసింగ్‌ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీలో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని జేసీబీతో సోమవారం చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులతో త్వరలో సమావేశమై ప్రణాళికలు రూపొందించి నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. అదేవిధంగా షటిల్‌ కోర్టు కూడా ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్‌ హౌసింగ్‌ సొసైటీ జనరల్‌ సెక్రటరీ భాస్కర్‌ రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ సమ్మారెడ్డి, సాయి ప్రభాకర్‌, ఇస్మాయిల్‌, శివరాజుగౌడ్‌, కాలనీ వాసులు ఉన్నారు.

‘కేంద్రమంత్రి అమిత్‌ షాను బర్తరఫ్‌ చేయాలి’

బాలానగర్‌: కేంద్రమంత్రి అమిత్‌ షాను బర్తరఫ్‌ చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్‌ చేశారు.ఈ మేరకు శ్రీశ్రీ నగర్‌ మెయిన్‌ రోడ్డులో గల డాక్టర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్‌, సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జీ కృష్ణ, సీపీఎం కూకట్‌పల్లి కార్యదర్శి ఎం. శంకర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్లమెంట్‌ సమావేశాల్లో కేంద్రమంత్రి అమిత్‌ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు చారి, శంకర్‌, నర్సింహ, రాములు, చంద్రయ్య పాల్గొన్నారు.



నిరసనలో సీపీఐ, సీపీఎం నాయకులు

స్వదేశీ సంస్కృతిని కాపాడుదాం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ సీనియర్‌ నాయకుడు శ్రీనివాస్‌, తదితరులు

మోతీనగర్‌: ‘విదేశీ విష సంస్కృతిని విడనాడుదాం..స్వదేశీ సంస్కృతిని కాపాడుదాం..జనవరి ఒకటి వద్దు’ అంటూ బీజేపీ సీనియర్‌ నాయకుడు నార్లపురం శ్రీనివాస్‌ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రీనగర్‌లోని గాంధీ విగ్రహం నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి ఒకటి అనేది ఒక తేదీ మారడం మాత్రమే అని అన్నారు. పాశ్చాత్య సంస్కృతిని వీడి స్వదేశీ సంస్కృతిని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గోనెల సుదర్శన్‌ ముదిరాజ్‌, సీహెచ్‌. వెంకట్‌రాంరెడ్డి, ఆంజనేయులు, జిత్తు బాయ్‌, ఉప్పల దామోదర్‌ నేత, నాగరాజుగౌడ్‌, కృష్ణ కుమార్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్‌ సెమిస్టర్‌ పరీక్షలు వాయిదా వేయాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: యూజీసీ నెట్‌ తేదీల్లో ఉన్న ఎంటెక్‌ సెమిస్టర్‌ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ జేఎన్‌టీయూహెచ్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌, స్టూడెంట్‌ ప్రొటెక్షన్‌ ఫోరం నాయకులు కోరారు. ఈమేరకు యూనివర్సిటీ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌ జీవీ నరసింహారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు రాహుల్‌ నాయక్‌ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి సెమిస్టర్‌ పరీక్షలకు సిద్ధమయ్యారని, అనేకమంది ఉన్నత చదువుల కోసం పీజీ, పీహెచ్‌డీ, యూజీసీ జేఆర్‌ఎఫ్‌ల కోసం ఏళ్ల తరబడి నెట్‌కు సన్నద్ధమవుతున్నారని, అయితే రెండు పరీక్షలు ఒకటే తేదీల్లో ఉన్నాయని దీంతో జనవరి 7, 9 తేదీల్లో జరగనున్న ఎంటెక్‌ సెమిస్టర్‌ పరీక్షలను వాయిదా వేయాలని కోరామన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ సానుకూలంగా స్పందించి వాయిదా వేస్తామని హామీనిచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌, అర్జున్‌ గౌడ్‌, సాయికుమార్‌, జవ్వాజి దిలీప్‌, రోహిత్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హోమం, అన్నదానం



హోమం నిర్వహిస్తున్న మక్కాల సత్యనారాయణ



భక్తులకు అన్నదానం చేస్తున్న సత్యనారాయణ

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్‌ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మక్కాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం హోమాలు, పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కాల సత్యనారాయణ మాట్లాడుతూ.. అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని, ప్రతీ అమావాస్యకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ రమేశ్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ మక్కాల నర్సింగ్‌రావు, కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్‌, దండుగుల నర్సింగ్‌రావు, బీఆర్‌ఎస్‌ నాయకులు బల్‌రాజు, నగేశ్‌ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లోని ఈనాడుకాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమిటీ మెంబర్లు టీఎన్‌కే చౌదరి, అచ్చిరెడ్డి, సురేశ్‌ కుమార్‌, నాగభూషణం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఈనాడుకాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ సభ్యులు, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు టీఎన్‌కే చౌదరి, అడ్వైజర్‌ రాధాకృష్ణ, వైస్‌ప్రెసిడెంట్‌ భుజంగరావు, జనరల్‌ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌ ఉమా శంకర్‌ రెడ్డి, సెక్రటరీ నాగుల్‌నన్నే షేక్‌, శ్రీనివాసులు రెడ్డి, జాయింట్‌ సెక్రటరీలు సునీల్‌, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ చైర్మన్‌ వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా 31వ తేదీ ఉదయం లక్ష్మీ గణపతి హోమం, పలు పూజలు చేయనున్నట్లు ఆలయ చైర్మన్‌ వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు.

గీతాంజలి ఒలింపియాడ్‌ ప్రైమరీ స్కూల్‌ వార్షికోత్సవం

బంజారాహిల్స్‌: కూకట్‌పల్లిలోని వీవీనగర్‌ గీతాంజలి ఒలింపియాడ్‌ ప్రైమరీ స్కూల్‌ వార్షిక వేడుకలు బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌-10లోని సంత్‌ సేవాలాల్‌ భవన్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గీతాంజలి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌ చైర్మన్‌ పుట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్‌ సయ్యద్‌ క్వారాతుల్‌ ఆయిన్‌ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

నిజాయితీ చాటిన ఆర్టీసీ డ్రైవర్‌, కండక్టర్‌

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డ్రైవర్‌, కండక్టర్‌ తమ నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రగతినగర్‌కు చెందిన తారాబాయి (55) కూతురుతో కలిసి 3 రోజుల క్రితం మెహిదీపట్నం నుంచి ప్రగతినగర్‌ (19 ఎంపీ) రూట్‌ గల కూకట్‌పల్లి డిపో బస్సులో ప్రగతినగర్‌ నుంచి ఎర్రగడ్డకు ప్రయాణించారు. ఎర్రగడ్డలో బస్సు దిగే సమయంలో బంగారం, నగదు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయారు. వెంటనే టికెట్‌పై ఉన్న హెల్ప్‌ లైన్‌ నంబర్‌కు ఫోన్‌ చేయడంతో వారు స్పందించి కూకట్‌పల్లి డీఎం దృష్టికి తీసుకెళ్లారు. డిపో మేనేజర్‌ హరి బాధితులను సోమవారం కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోకు పిలిచి 5 తులాల బంగారం, నగదును అందజేశారు. అదేవిధంగా కండక్టర్‌ మధుబాబు, డ్రైవర్‌ రాముకు రూ. 500 రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ మేనేజర్‌ శ్రీలత, టీఐ సావిత్రి, అరుణ, ఏడీసీ చిన్నప్ప, సెక్యూరిటీ ఎస్‌ఐ అన్వర్‌ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు బంగారం, నగదును అప్పగిస్తున్న డీఎం హరి

పంచశీల స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌ ఆవరణలో భరత్‌నగర్‌కాలనీలోని రీ లైఫ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వైద్యులు దీప్తి, రాజీవ్‌ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ పంచశీల శ్రీనివాస్‌, ఆసుపత్రి సిబ్బంది రమేశ్‌ చంద్ర, శ్రీకాంత్‌, మౌనిక, రమ్య, శ్యామ్‌ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రే ఆఫ్‌ జాయ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో..

బాలానగర్‌: ఫతేనగర్‌ డివిజన్‌ ఇందిరాగాంధీపురంలో రే ఆఫ్‌ జాయ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా హెల్త్‌ క్యాంప్‌ను కార్పొరేటర్‌ పండాల సతీశ్‌ గౌడ్‌ ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు దాదాపు 200 మందికి బీపీ, షుగర్‌, తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులు, వైద్యులను, సిబ్బందిని కార్పొరేటర్‌ అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జాకీర్‌, ఇందిరాగాంధీపురం నాయకులు గౌస్‌, అన్వర్‌, షౌకత్‌, ఖైసర్‌, అస్మాత్‌, అఫ్జల్‌, బద్రి, శంకర్‌, ఉదయ్‌ ముదిరాజ్‌, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి బీపీ చెక్‌ చేస్తున్న వైద్యుడు